




*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## మేమ్ సాహెబా

"**నిన్న సాయంత్రం** ఓ పదినిమిషాలు లేటుగా ఇంటికి వెళ్ళానని మా మేమ్ సాహెబా అప్పడాల కర్రతో ఒక్కటిచ్చింది." దెబ్బ అప్పుడే తగిలినట్లుగా తల తడుముకుంటూ చెప్పాడు వినయ్.

అది అతిశయోక్తి అని తెలుస్తున్నా ఫక్కున నవ్వారు తోటి ఉద్యోగులు. అప్పుడే ఆఫీసులోకి అడుగుపెడుతున్న అరుణ పెదవులు విచ్చుకున్నాయి. కించిత్ జాలితో అతని వంక ఓరకంట చూసింది.

ఆమెనే చూస్తున్న వినయ్ తడబడి, కంప్యూటర్‌లోకి చూపు తిప్పాడు. అరుణకి గర్వంగా అనిపించింది. పెళ్ళయినా అతను తననింకా ఆరాధిస్తున్నాడన్న భావన ఆమెకి అతిశయాన్నిచ్చింది. అది ఆమె మొహంలో ప్రస్ఫుటమైే చిరునవ్వుతో వెలిగిపోయింది.

అరుణ, వినయ్ దాదాపు ఒకేసారి ఆ ఆఫీస్‌లో చేరారు. వయసు, చదువు కూడా ఒకటే. 'విజాతి ధృవములు ఆకర్షించుకొనును' అనే శాస్త్రీయసూత్రం ప్రకారం చేరిన రెండో నెలనించే వినయ్ అరుణని ప్రేమించసాగాడు. అరుణకీ అది బాగానే అనిపించింది కానీ, అతన్ని ప్రోత్సహించక, నిశ్శబ్ధంగా ఉండిపోయింది.

ఏడాది తర్వాత వినయ్ నించి ఆమెకి ఒక ఇ మెయిల్ వచ్చింది. సారాంశం ఊహించిందే 'ఆమెని గాఢంగా ప్రేమించానని, ఒప్పుకుంటే పెద్దవాళ్ళకి చెప్పి పెళ్ళిచేసుకుంటానని' ప్రాధేయపడుతూ రాసాడు.

ఆ రాత్రి అరుణ అతని గురించి సీరియస్‌గా ఆలోచించింది. సాధారణ రూపం, తనలాంటి మధ్యతరగతి కుటుంబం, తన చదువు, తనకి వచ్చేంత జీతం.

స్త్రీ పురుష సమానత్వం మీద గంటలతరబడి మాట్లాడే అరుణకి తన సమానస్థాయిలోని వ్యక్తిని భర్తగా ఊహించుకోవడం కష్టంగా అనిపించింది. తన అందానికి తమకంటే స్థితిమంతుడు, పెద్ద ఉద్యోగం, పెద్ద చదువు ఉన్న అందగాడిని చేసుకోవాలి కాని ఈ జిడ్డు మొహం వినయ్ తనకి తగడు అని నిర్ణయించుకున్నాక హాయిగా నిద్రపోయింది.

మర్నాడు నిద్రలేచాక తన కోరికలు తల్లికి చెప్పి, తండ్రి సంబంధాలు వెదికేప్పుడు గుర్తుంచుకోమని చెప్పింది.

ఆఫీస్‌కి వెళ్ళాక లార్జ్ ఫాంట్‌లో 'నో' అని రిప్లై పంపింది. వినయ్ ఆమె వంక నిరాశగా చూసాడు కాని ఆమెని ప్రాధేయపడే ప్రయత్నం చేయలేదు. అది అరుణకి అసంతృప్తిగా అనిపించింది. 'కొంచెం బతిమాలొచ్చుగా' అనుకుంది.

తర్వాత రెండు రోజులకే వినయ్ సెలవు పెట్టి తల్లితండ్రుల ఊరికి వెళ్ళాడు. ఆ తర్వాత రెండు రోజులకి వినయ్‌తో సన్నిహితంగా ఉండే కొలీగ్ 'వినయ్‌కి పెళ్ళి కుదిరిందిట' అని తోటి ఉద్యోగులకి చెప్పడం విని ఆమె మనసు కలుక్కుమంది.

'వెధవ! అంత ప్రేమని ఒలకపోసి, కొంచెం కూడా బాధలేకుండా పెళ్ళికి సిద్ధమయ్యాడు' అని తిట్టుకుంది.

'వాడు కిందపడి పొర్లిగింతలు పెట్టి ఏడ్చినా నేను వీడిని చేసుకునేదాన్ని కాదు.. వీడి మొహానికి ఏ లోయర్ క్లాస్ ఇంటర్మీడియెట్ పిల్లో దొరికి ఉంటుంది' అనికూడా అనుకుంది.

ఆ తర్వాత రెండు రోజులకి ఆఫీస్‌కి వచ్చిన వినయ్ యధాప్రకారం ఆమెని జాలి చూపులు చూస్తూ పెండింగ్ పనిలో బిజీ అయ్యాడు.

'వీడికి పెళ్ళి కుదరడం అబద్ధం అయుంటుంది. ముఖంలో కళలేదు' అని మనసుకి నచ్చచెప్పుకుంది.

ఆ మధ్యాహ్నం వినయ్‌కి కొరియర్‌లో ఓ పార్సిల్ వచ్చింది. దాన్ని విప్పిన వినయ్ శుభలేఖలని ఓసారి నిశితంగా పరిశీలించి మొదటి కార్డ్‌ని అరుణకి అందించాడు. దాన్ని చూడగానే ఎందుకో ఆమెకి దుఃఖం వచ్చింది.

పెళ్ళికూతురు పేరు నిరతి. వధూవరుల పేరు పక్కన డిగ్రీలు వేయలేదు. ఏం చదివిందో అడగడానికి అభిమానం అడ్డొచ్చింది. 'నిరతి! ఎంత అందమైన పేరు!' అనుకుంది. ఈ కాలంలో తనకి అరుణ అని ఆ కాలం పేరు పెట్టిన తల్లితండ్రుల మీద కోపం వచ్చింది.

"వాళ్ళ ఫాదర్ మహారాష్ట్రలో బారామతిలోని షుగర్ ఫేక్టరీలో పనిచేస్తారు. తను అక్కడ పుట్టి పెరిగింది. తెలుగు అంత బాగారాదు" వినయ్ ఎవరికో ఉత్సాహంగా చెప్తున్నాడు.

'వెధవ! పెళ్ళి అనగానే ఎంత హుషారో' అరుణ భగ్గుమంది.

పెళ్ళికి వెళ్ళొచ్చిన కొలీగ్స్‌ని 'పెళ్ళికూతురు ఎలా ఉంది?' అని అడగాలనుకుంది. కానీ అభిమానం అడ్డొచ్చి అడగలేదు. ఆమె మీద వినయ్‌కి గల ప్రేమ గురించి ఆఫీస్‌లో అందరికీ తెలుసు.

హనీమూన్ వెళ్ళొచ్చిన వినయ్ తేటగా కనపడ్డాడు. కొత్తదుస్తులు. కొత్తగా లంచ్ బాక్స్ తెచ్చుకుంటున్నాడు.

ఖాళీ సమయం దొరికినప్పుడల్లా భార్యమీద జోక్స్ వేసి నవ్విస్తున్నాడు. వాటి ప్రకారం వినయ్ భార్యకి భర్తంటే ఏ మాత్రం వినయవిధేయతలు లేవు. పనిరాదు. వంటరాదు. పైపెచ్చు కోపం ఎక్కువ. మరాఠీలో తిడుతుంది కాబట్టి బాధలేదు.

అరుణకి ఒక్క సంబంధం నచ్చడం లేదు. వినయ్ మేమ్‌సాహెబా గురించి రసవత్తరంగా కథలు చెప్తూనే ఉన్నాడు. అవి చెప్పేప్పుడు అతని మొహంలో కనబడే చిరునవ్వు ఆమెకి ఒంటికి కారం పూసుకున్నట్లుగా ఉంటోంది.

"మా మేమ్ సాహెబాని పులిహోర చేయమంటే ఏమందో తెలుసా?" చిద్విలాసంగా చూస్తూ అడిగాడు.

"ఏమంది?" కొలీగ్ ఆత్రంగా అడిగాడు.

"నేను నాన్‌వెజ్ తినను వండను అంది." పెద్దగా నవ్వుతూ చెప్పాడు.

"వీడి డొక్కు మొహానికి తోడు అన్నీ కుళ్ళు జోకులు" మనసులోనే విసుక్కుంది అరుణ.

"నువ్విలా చెప్పడమే కాని మీ ఇంటికి మమ్మల్నందర్నీ పిలిచి ఒక్క గెట్ టు గెదర్ కూడా పెట్టలేదు." ఒక కొలీగ్ నిష్ఠూరంగా చెప్పాడు.

"అవును. మా అందర్నీ కనీసం స్నాక్స్‌కైనా పిలవచ్చుగా?" మరో కొలీగ్ అడిగాడు. అంతా బలపరిచారు. సాధ్యమైనంతవరకు నిరాకరించినా చివరికి ఒప్పుకున్నాడు వినయ్.

"సరే. మా మేమ్ సాహెబాని అడిగి చెప్తాను."

"నువ్వు మరీ భార్యా విధేయుడైపోయావు" ఒకతను చెప్పాడు.

"మరి? ఆ అమ్మాయి ఎక్కడో బారామతిలో తల్లితండ్రుల్ని, తమ్ముడ్ని వదిలి, నన్ను నమ్మి ఇంతదూరం వచ్చింది. మరి తనని గౌరవించద్దా?" వినయంగా అడిగాడు వినయ్.

అరుణకి గుండెల్లో మంటగా అనిపించింది.

"రేపు శుక్రవారం సాయంత్రం ఆఫీస్ అయ్యాక అంతా మా ఇంటికి వెళ్తున్నాం. టీ, స్నాక్స్ కాదు. డిన్నర్‌కే పిలవమంది మేమ్ సాహెబా" మర్నాడు ఎనౌన్స్ చేసాడు వినయ్.

"హుర్రే! అలాగే, పులిహోర చేయమని చెప్పు." కొలీగ్స్ ఉత్సాహంగా చెప్పారు. అరుణ సీట్ దగ్గరికి వెళ్ళి వంగి ఆమెతో చెప్పాడు వినయ్.

"ఇంటికి రావడం లేటవుతుందని, కంగారు పడద్దని మీ మదర్‌తో చెప్పి రండి. ఆఫీస్ నించే అంతా మా ఇంటికి వెళ్దాం."

"నాకు పనుంది. రాను." గొణిగింది.

"ఆ పనేదో ఎల్లుండి చేసుకోండి. రతి మిమ్మల్ని ప్రత్యేకంగా పిలవమని చెప్పింది."

"నేనెలా తెలుసు ఆవిడకి?" చురుగ్గా ప్రశ్నించింది.

"మన ఆఫీస్‌లో ఉన్న ఏకైక లేడీ ఇంజనీర్‌గా తెలుసు. మీరు తప్పకుండా వస్తారుగా." వెళ్ళిపోయాడు.

మర్నాడు అరుణ అత్యంత శ్రద్ధగా మొదటి పెళ్ళి చూపులకి తయారైనంత అందంగా తయారైంది. ఇష్టంగా కొనుక్కున్న డ్రెస్ వేసుకుంది.

ఆఫీస్‌లో కొలీగ్స్ కూడా అంతా కొత్త బట్టల్లో మెరిసిపోతున్నారు. అందరికీ అడ్రస్ చెప్పి వినయ్ మధ్యాహ్నమే ఇంటికి వెళ్ళిపోయాడు.

"వంకాయ కూర చేయడం మర్చిపోకు గురూ." ఒకతను చెప్పాడు.

"నాకు సాంబార్ కావాలి." మరొకరు చెప్పారు.

"త్వరగా వెళ్ళి వంట ప్రయత్నం మొదలుపెట్టు. ఆకలేస్తోంది." అంతా ముక్తకంఠంతో చెప్పారు.

అరుణ ముసి ముసి నవ్వులు నవ్వింది. ఈ గంతకి తగిన బొంత ఎలాగుందో ఇవాళ తెలుస్తుంది.

ఐదుగంటలకల్లా అంతా కంప్యూటర్లు షట్‌డౌన్ చేసి ఎవరి వాహనాలపై వారు వినయ్ ఇంటికి బయలుదేరారు. అరుణ తన బైక్‌ని స్టార్ట్ చేస్తూ నవ్వుకుంది. 'బారామతి పిల్ల' బైక్ నడిపే తనని చూసి విభ్రాంతి చెందుతుంది.

వినయ్ ఇల్లు రెండు బెడ్‌రూమ్స్ ఉన్న అపార్ట్‌మెంట్. అందంగా, శుభ్రంగా ఉంది. గ్రౌండ్ ఫ్లోర్ అవడంతో ఇంటిముందు ఉన్న కొద్దిపాటి స్థలంలో పూలకుండీలు, చిన్న ఉయ్యాల ఉన్నాయి.

"ఇల్లు చాలా బావుంది గురూ. నీట్‌గా ఉంది. నువ్వు ఇంటా బయటా తెగ కష్టపడిపోతున్నావు." ఒకతను సానుభూతిగా చెప్పాడు.

"ఇంతకీ మేమ్ సాహెబ్‌ని చూపించవా? ఘోషానా?" అరుణ మనసులోని మాటని ఒకరు అడిగారు.

"తను ఇంకా రాలేదు. ఒక ఐదునిమిషాల్లో ఉంటుంది" వినయ్ చెప్పాడు.

"మేమొచ్చే టైంకి వెళ్ళడం ఏమిటి? అసలు మమ్మల్ని రమ్మని నిజంగా మేమ్ సాహెబానే చెప్పిందా?" అనుమానంగా అడిగాడు.

"నీకా సందేహమే అక్కర్లేదు. తనే రమ్మని చెప్పింది. మీరు చెప్పినట్లే వంకాయకూర, సాంబార్ ఎట్సెట్రా అన్నీ నేను చేసేసా. అదిగో మాటల్లోనే వచ్చేసింది" బయటకి చూస్తూ చెప్పాడు వినయ్.

అంతా అసంకల్పితంగా అతను చూసేవైపు చూసారు. కాంపౌండ్ వాల్ లోపలకి ఓ తెల్లకారు వచ్చి ఆగింది. డ్రైవింగ్ సీట్లోంచి మెరుపు తీగలాంటి అమ్మాయి దిగింది. బ్లూ జీన్స్ మీద తెల్లరంగు కుర్తా వేసుకున్న ఆమె చేతికి వాచ్ తప్ప ఇక ఒంటిమీద నగలేం లేవు. చెప్పులు విప్పి హడావిడిగా లోపలికి వచ్చి క్షమాపణ చెప్పింది.

"సారీ. ముందే రావాలనుకున్నాను కానీ లాస్ట్ మినిట్‌లో కేస్ రావడంతో ఆగిపోవాల్సి వచ్చింది."

అంతా ప్రశ్నార్థకంగా చూసారు. వినయ్ ఆమె చేతిని పట్టుకుని వాళ్ళ దగ్గరకి తీసుకొచ్చి కొలీగ్స్ అందరినీ పరిచయం చేసాడు. అందరికీ నమస్కారాలు చేసిన నిరతి అరుణ చేతిని మృదువుగా నొక్కి చెప్పింది.

"మీరంతా మా ఇంటికి రావడం నాకెంతో ఆనందంగా ఉంది."

మొరటుగా ఉన్న తన చేతివేళ్ళని అల్లుకున్న ఆమె నాజూకైన వేళ్ళని అరుణ అసూయగా చూసింది.

"ఈమె నిరతి. నా మేమ్‌సాహెబా. డెంటిస్ట్. పోలీ క్లినిక్‌లో చేరింది. చెప్పాగా మన వంటలు రావు. తెలుగు కూడా మాట్లాడటం వచ్చు అంతే..."

ఇంకేదో చెప్పబోతున్న అతని నోటికి చేతికి అడ్డుగా ఉంచి చెప్పింది నిరతి.

"ష్! వినయ్ మంచి హస్బెండ్ అతని కోపం చూడలేదు ఇంతదాకా." వాళ్ళతో కబుర్లు చెప్తూనే నిరతి, వినయ్ వంటకాలని వేడి చేయడం, టేబుల్ సర్దడం చేసారు. మధ్య మధ్యలో అతను ప్రయత్నపూర్వకంగా ఆమెని తాకుతున్నాడని గ్రహించిన అరుణకి సన్నగా తలనొప్పి మొదలైంది.

లేచి బాత్‌రూంలోకి వెళ్ళి అద్దంలో తనని తాను చూసుకుంది. చెవులకి గంటల్లాంటి పెద్ద బుట్టలు, చేతికి నాగుపాములాంటి బ్రేస్‌లెట్, వెడల్పుగా ఉన్న గొలుసు. ధగధగలాడే పంజాబీ డ్రెస్, ఏదో పెళ్ళికి వెళ్తున్నట్లుగా ఉంది. పొద్దున ముద్దొచ్చిన రూపం ఇప్పుడు నవ్వొచ్చేలా ఉంది.

"నాలుగు కుర్చీలే ఉన్నాయి కదా. సో బఫేలాగా తిందాం. టేబుల్ మీద అన్నీ సర్దేశాం. ప్లేట్స్ కూడా పెట్టేసాం. మీరు సర్వ్ చేసుకుని సోఫాలో కూర్చుని తినండి" నిరతి సూచించింది.

"నేను మారు వడ్డిస్తాను."

అంతా వెళ్ళి వడ్డించుకుని ప్లేట్లతో సోఫాలో కూర్చున్నారు.

"మీరు కూడా రండి." అరుణ ఆహ్వానించింది.

"లేదు. నేను తర్వాత తింటాను. మిమ్మల్ని అటెండ్ అవాలిగా" నిరతి నిరాకరించింది. నిజంగా వినయ్ అద్భుతంగా వంట చేసాడు.

"రతీ! ఎప్పుడనగా వెళ్ళావో డ్యూటీకి. కనీసం స్వీట్ తిను." వినయ్ ఓ చిన్న బౌల్‌లో గులాబ్‌జామ్ వేసి నోరు తెరిచిన ఆమెకి స్పూన్‌తో నోటికి అందించి అడిగాడు. "కొంచెం పులిహోర కూడా పెట్టనా?"

అంతా పెద్దగా నవ్వారు. అర్థంకాని నిరతి కూడా నవ్వేసింది.

అరుణకి తలనొప్పి అధికమైంది. ముళ్ళమీద కూర్చున్నట్లుగా ఓ ఐదు నిమిషాలు కూర్చుని హఠాత్తుగా లేచి చెప్పింది.

"నాకు తలనొప్పిగా ఉంది. వెళ్ళిపోతాను."

"అప్పుడేనా? ఇంకా ఎనిమిది కూడా కాలేదు. కూర్చోండి కబుర్లు చెప్పుకుందాం" ఓ కొలీగ్ చెప్పాడు.

"లేదు.  వెళ్ళాలి" కటువుగా చెప్పింది.

బేగ్ అందుకుని, సర్వ్ చేస్తున్న నిరతి దగ్గరకి వెళ్ళి చెప్పింది "వస్తానండి."

"థాంక్స్. మళ్ళీ తీరుబడిగా రండి" నిరతి ఆహ్వానించింది.

మర్యాదపూర్వకంగా వినయ్ ఆమె వెంట గేటు దాకా నడిచాడు.

బైక్ ఎక్కి వినయ్‌ని చెంప మీద బలంగా ఛెళ్ళున కొట్టి స్టార్ట్ చేసి వెళ్ళిపోయింది అరుణ.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments on this story